క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఓజో ఫౌండేషన్ చేయూత



కోటయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఓజో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ వెంకన్న,తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన బెజవాడ కోటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఓజో ఫౌండేషన్ తరఫున బాధిత కుటుంబసభ్యులకు రూ. 5 వేల ఆర్థికసాయం, 50 కేజీల బియ్యం అందజేశారు. ఆయనవెంట ఓజో ఫౌండేషన్ సభ్యులు యల్లావుల శివశంకర్‌యాదవ్, మాలోతు ఉపేందర్‌నాయక్, సునీల్, కనకయ్య, గ్రామ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జానపద నృత్య పోటీలలో ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతి అందుకున్న కళాశాల విద్యార్థినులు

మునగాల : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని ఆకుపాముల శివారులో గల తెలంగాణ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు పాల్గొని జానపద నృత్య పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సుక్క సుశీల తెలిపారు. తమ పాఠశాల విద్యార్థినులు ఉపాన్యాస పోటీలలో ద్వితీయ, తృతీయ, పాటల పోటీలో తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు.

పూర్తి బాధ్యతలు అప్పగించాలని వినతి

నడిగూడెం : తనకు పూర్తి బాధ్యతలు అప్పగించాలంటూ కరివిరాల సర్పంచ్ గుర్రం నీలిమా గాంధీ కోరారు. ఈమేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ యం.యర్రయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో తనను కావాలని అధికార పార్టీకి చెందిన నాయకులు అన్యాయంగా సస్పెండ్ చేయించారని, దీంతో తాను హైకోర్టుకు వెళ్లి న్యాయం పోరాటం చేసి ఉత్తర్వులు తెచ్చుకున్నానని అన్నారు. దీనిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చిన తనకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కేటీఆర్ సారొస్తున్నారు.. పరిశుభ్రంగా ఉంచుదాం



రోడ్లకు ఇరుపక్కల శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఈ నెల 6న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్న నేపథ్యంలో నేరేడుచర్ల మున్సిపాలిటీలో రోడ్ల ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. రోడ్లపై గుంతలు ఉంటే పూడుస్తున్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు దగ్గరుండి రోడ్ల పరిసరాలను శుభ్రం చేయించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరుపక్కల పిచ్చి మొక్కలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) క్యాలెండర్‌లను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తూనం నాగేశ్వరరావు, నోడల్ అధికారి డాక్టర్.శరత్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.భిక్షం, ఎండీ.మౌలానా, రామినేని సతీష్, సురేష్, కృష్ణయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బేతవోలులో గ్రామసభ

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో నిర్మించిన 40 డబుల్ బెడ్ రూం ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికపై గురువారం మొదటి గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి బుధవారం విలేకరులకు తెలిపారు. దరఖాస్తుదారులు గ్రామ సభకు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

నత్తనడకన ‘మన ఊరు- మన బడి’

- నిధులొచ్చి ఆరు నెలలు
- సీత్లాతండా మినహా మిగతా పాఠశాలల్లో శిలాఫలకాలే దర్శనం
- కాంట్రాక్టర్లు ముందుకు రాక పూర్తి కాని టెండర్లు



చిలుకూరు మండలం సీత్లాతండాలో స్లాబ్ వరకు పూర్తయిన పనులు



కొండాపురంలో శిలాఫలకం

చిలుకూరు : కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు- మన బడి పథకం క్షేత్ర స్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. సకాలంలో బిల్లులు వస్తాయో రావోనన్న భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో మండలంలోని పలు పాఠశాలల్లో శిలాఫలకాలే దర్శనమిస్తున్నాయి. ఒకటి, రెండు పాఠశాలలో పనులు ప్రారంభం అయినా మందకొడిగానే సాగుతున్నాయి.

నిధులొచ్చినా..

మన ఊరు- మన బడి పథకం కింద మొదటి విడతలో మండలంలోని చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.1.19 కోట్లు, బేతవోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.76 లక్షల 84 వేలు, నారాయణపురం ప్రాథమిక పాఠశాలకు రూ.44 లక్షల 15 వేలు, సీత్లాతండాలోని ప్రాథమిక పాఠశాలకు రూ.39 లక్షలు, జెర్రిపోతులగూడెం ప్రాథమిక పాఠశాలకు రూ.28.35 లక్షలు, కొండాపురం ప్రాథమిక పాఠశాలకు రూ.73.70 లక్షలు, రామాపురంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలకు రూ.68 లక్షల 98 వేలు, పోలేనిగూడెం ప్రాథమిక పాఠశాలకు రూ.24 లక్షలు మంజూరయ్యాయి. అయితే నిధులు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా పనుల ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. దీంతో పాఠశాలల్లో శిలాఫలకాలు ఎక్కిరిస్తున్నాయి.

ముందుకు రాని కాంట్రాక్టర్లు..

కాగా చిలుకూరు, బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొండాపురం పీఎస్, రామాపురం ప్రాథమిక పాఠశాలలకు నేటివరకు టెండర్లు ఖరారు కాలేదు. అయితే ప్రభుత్వం టెండర్లు పిలిచినప్పటికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. సీత్లాతండా ప్రాథమిక పాఠశాలలో మాత్రం 50శాతం పనులు పూర్తయ్యాయి. ఇక జెర్రిపోతులగూడెం పాఠశాలలో వారం రోజుల క్రితమే నిర్మాణ పనులకు ముగ్గు పోశారు. నారాయణపురం, పోలేనిగూడెం ప్రాథమిక పాఠశాలల్లో నేటికీ పనులు ప్రారంభించలేదు. కాగా చిలుకూరు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు రూ.6 లక్షల 84 వేలు మంజూరవడంతో ఈ పనులతో కరెంట్, పాఠశాలకు రంగుల పనులు దాదాపుగా పూర్తయ్యాయి. గదుల మరమ్మతులు పనులు కొనసాగుతున్నాయి. అదే విధంగా రామాపురం ప్రాథమిక పాఠశాలకు మంజూరైన రూ.9 లక్షల 53 వేలతో పాఠశాలలకు, విద్యుత్ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి.

అధికారులు దృష్టి పెట్టడం లేదు



ప్రభుత్వం మన ఊరు -మన బడి కింద నిధులు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా నేటికీ అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించలేదు. మొదట్లో ఆర్భాటంగా పనులకు శంకుస్థాపన చేశారు.. ఆ తరువాత అధికారులు పనులపై దృష్టి పెట్టడంలేదు. దీంతో పేద విద్యార్థులు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులు లేక విద్యార్థులను వరండాలో కూర్చొబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఇప్పటికైనా పనులను తక్షణమే ప్రారంభించాలి.
– గోగుల వీరభద్రయ్య, విద్యార్థి తండ్రి, చిలుకూరు

పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం



మన ఊరు- మన బడి పథకం కింద నిధులు మంజూరైన పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. కొన్ని పాఠశాలల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం.
– సలీమ్ షరీఫ్, మండల విద్యాధికారి, చిలుకూరు

ఉత్తమ్ సహనం కోల్పోయి మాట్లాడుతున్నారు

- ఎమ్మెల్యే సైదిరెడ్డి



ఎమ్మెల్యే సైదిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

హుజూర్‌నగర్ : ఎంపీ ఉత్తమ్ ఇటీవల సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తమ్ ఎక్కడికి పోయినా 50 వేల మెజార్టీ గురించి మాట్లాడుతున్నారని.. మెజారిటీ సంగతి దేవుడు ఎరుగు ముందు 50 వేల ఓట్లు తెచ్చుకోవాలని అన్నారు. రాజకీయ సన్యాసం చేయడం కాదు ప్రజలే ఆయనకి సన్యాసం ఇచ్చేలా ఉన్నారని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గరి నుంచి ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకున్నానని, అభివృద్ధి చేయడానికి దేనికైనా సిద్ధమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కడియం వెంకటరెడ్డి, దొంతగాని శ్రీనివాస్, పి.ఉపేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇరిగేషన్ అధికారులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని బుధవారం ఇరిగేషన్ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆ శాఖ ఈఈ శ్రీనివాస్, డీఈలు స్వామి, భిక్షం, జేఈలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సబ్ ట్రెజరీ అధికారులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ..

తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘం డైరీని ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ పాలక్ మల్లేశం

హుజూర్‌నగర్ : బీజేపీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7న నిర్వహించే నియోజకవర్గాల బూత్ మహా సమ్మేళనంలో (వర్చువల్ మీటింగ్) బూతు స్థాయి నుంచి మండల నాయకుల వరకు పాల్గొనాలని కోరారు. ఈ వర్చువల్ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొంటారని చెప్పారు. అనంతరం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్ రెడ్డి.. దాసరి మల్లేశంను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు కె.లచ్చిరెడ్డి, ఎ.అబ్బాస్, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.చంద్రారెడ్డి, ఎ.కోటయ్య, డి.యల్లయ్య, కె.కోటిరెడ్డి, సీహెచ్.సోమయ్య, ఆర్.కృష్ణయ్య, వి.గోపినాథ్, జి.సతీష్, రంగనాథ్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



రాఘవాపురంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శాంభరెడ్డి, అధికారులు

మోతె : నర్సరీల్లో సంచుల్లో మట్టి నింపే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌పీఓ శాంభరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంటి పన్నును ఈ నెల 26 వరకు వసూలు చేయాలని ఆదేశించారు. మండలంలోని కూడలి, రావికుంటతండాలో ఈ నెల 15న కలెక్టర్ పర్యటన ఉంటుందన్నారు. అనంతరం మండల పరిధిలో రాఘవాపురంలో ఎంపీడీఓతో కలిసి నర్సరీని పరిశీలించారు. అలాగే శ్మశాన వాటిక, డంపింగ్ యార్డులను సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో 10 వేల నాణ్యమైన మొక్కలు పెంచాలన్నారు. మొక్కలు పెంచే క్రమంలో మెళకువలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ హరిసింగ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ వెంకన్న, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తెలంగాణలో అరాచకపాలన సాగుతోంది



కోదాడలో నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు



చిలుకూరు : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

కోదాడ : బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని, ప్రభుత్వం వ్యక్తి స్వేచ్ఛను హరిస్తుందని ఆరోపిస్తూ ఆ పార్టీ నాయకులు బుధవారం కోదాడలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని విమర్శించారు. ఒక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారంటే ప్రభుత్వం ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కొండా భీమయ్యగౌడ్, గుండెపంగు రమేష్, సాలె రామారావు, కాంపాటి శ్రావణ్‌కుమార్, చింతల రమేష్, నాగమణి, నాగయ్య, చిరంజీవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో బీఎస్పీ నాయకుల నిరసన

చిలుకూరు : బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌ను ట్యాప్ చేయడంపై ఆ పార్టీ నాయకులు బుధవారం మండల కేంద్రంలోని హరిజనవాడ దగ్గర గల అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఫోన్ ట్యాప్ చేయడం చట్టరిత్యా నేరమని అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్, నాయకులు ముదిగొండ నాగయ్య, కందుకూరి వెంకన్న, నాగేశ్వరరావు, గజ్జి వీరబాబు, రాకేష్, జాను, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన జయప్రదానికి ప్రచారం

మఠంపల్లి : హుజూర్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, అనంతరం బహిరంగ సభలో ప్రసంగించేందుకు ఈ నెల 6న వస్తున్న రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంతో పాటు మట్టపల్లి, గుర్రంబోడు తండా, కృష్ణాతండా, పెదవీడు, వరదాపురం, అల్లీపురం, కొత్తతండా, మంచ్యాతండా, రామచంద్రాపురంతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జట్పీటీసీ జగన్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, మాజీ ఎంపీపీలు కొండానాయక్, కె.లక్ష్మీవెంకటనారాయణ, సర్పంచ్‌లు మన్నెం శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మీవెంకటరమణ, కృష్ణ, రామారావు, పార్వతి, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, నవీన్‌నాయక్, భరత్‌నాయక్, లాలూనాయక్, కోటానాయక్, శేఖరెడ్డి, రామచంద్రయ్య, బాలకృష్ణగౌడ్, సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌నాయక్, కాశయ్య తదితరులున్నారు.

మంత్రుల పర్యటనను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఈనెల 6న జరిగే మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పి.ఉపేందర్ కోరారు. బుధవారం పట్టణంలో జరిగిన ఆ సంఘం నాయకుల సమావేశంలో మాట్లాడారు. నియోజవర్గవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ కేవీ నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు మంత్రి పర్యటనలో భారీ ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామివారి ఊరేగింపు



హుజూర్‌నగర్‌రూరల్ : కోలాట ప్రదర్శనతో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



నడిగూడెం : గోపూజ చేస్తున్న పూజారి

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాసం ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సారే, ఒడి బియ్యం పోయు ట, అష్టోత్తర శతమావళి, సేవాకాలం, అలంకరణ, మంగళాశాసనం, కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి గోదాదేవి ఉత్సవ విగ్రహాలను ఆలయంలో మహిళల కోలాట ప్రదర్శనతో కనుల పండువగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సర్పంచ్ సలీమారంజాన్, వికాస తరంగిణి అధ్యక్షురాలు కళావతి, వెంకటేశ్వరావు, విజయలక్ష్మి, గిరిజమ్మ, కొండారెడ్డి, కళావతి, లచ్చిరెడ్డి, అర్చకులు హరీష్ కుమార్ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకోదండరామస్వామి ఆలయంలో గోపూజ

నడిగూడెం : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని సిరిపురంలో గల శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో బుధవారం గోపూజా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు వేదాంతం చక్రధరాచార్యులు, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు టీఎల్‌ఎం దోహదం



హుజూర్‌నగర్ : బోధనోపకరణాలను పరిశీలిస్తున్న జిల్లా సెక్టోరియల్ అధికారి, ఎంపీపీ, ఎంఈఓ



చిలుకూరు : టీఎల్‌ఎం మేళాలో జిల్లాకు ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : సులభతర బోధన, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు బోధన ఉపకరణాలు విశేషంగా దోహదపడతాయని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జిల్లా సెక్టోరియల్ అధికారి జనార్దన్, ఎంఈఓ సైదానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి టీఎల్‌ఎం మేళాలో వారు మాట్లాడారు. తొలిమెట్టులో భాగంగా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో టీఎల్‌ఎం మేళా కొనసాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో మండల, క్లస్టర్ నోడల్ అధికారులు బి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎంలు, విషయ నిపుణ రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

చింతలపాలెంలో..

చింతలపాలెంలో బుధవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు బోధనాభ్యసన పరికరాలు (టీఎల్‌ఎం)లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, సర్పంచ్ ఆయేషా అమీర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో సులభ బోధన

చిలుకూరు : టీఎల్‌ఎంతో విద్యార్థులకు సులభంగా పాఠాలు బోధించవచ్చని జిల్లా సెక్టోరియల్ అధికారి దేవరశెట్టి జనార్దన్ అన్నారు. బుధవారం చిలుకూరు మండల విద్యాధికారి కార్యాలయంలో మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఆయన పరిశీలించి మాట్లాడారు. కాగా టీఎల్‌ఎంలో మండలం నుంచి జిల్లాకు ఉపాధ్యాయులు పి.రామూర్తి, వి.శ్రీనివాసులు, కవిత, ధనలక్ష్మి, నాగశ్రీ, రఘు, అశోక్, టి.సుజాత, ఎస్,లింగయ్యలు ఎంపికైనట్లు నోడల్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, క్లస్టర్ నోడల్ అధికారి తేజోరాం, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీఎల్‌ఎం మేళా

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళా బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి డి.సీతరామారాజు మాట్లాడుతూ.. టీఎల్‌ఎం మేళాలో మండలం నుంచి జిల్లా స్థాయికి తెలుగు విభాగంలో ఉపాధ్యాయులు ఎస్.రాములు, కె.కల్పన, ఇంగ్లీష్ విభాగంలో వై.సుభాస్ చంద్రబోస్, టి.అన్నపూర్ణ, గణితం విభాగంలో ఎ.సత్యనారాయణ, ఎం.నరేష్, ఈవీఎస్ వై.చంద్రజ్యోతి, వై.శ్రీనివాసరావులు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతకాయల ఉపేందర్, ఎస్ఎంసీ చైర్మన్ తోకల సైదులు, రిటైర్డు హెచ్‌ఎం రవి, నేలమర్రి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచాలి

పాలకవీడు : ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరిగేలా కృషి చేయాలని ఎంఈఓ చత్రునాయక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నోడల్ అధికారి బాలునాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన బోధనాభ్యసన పరికరాలు (టీఎల్‌ఎం) కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు టీఎల్‌ఎం విధానం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరాంరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మునగాల : టీఎల్‌ఎం మేళాలో ప్రశంసాపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు



పాలకవీడు : బోధన పరికరాలను చూపుతున్న ఎంఈఓ చత్రునాయక్



హుజూర్‌నగర్ : చింతలపాలెంలో టీఎల్‌ఎం మేళాను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఘనంగా ఎంఎస్పీ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఎస్పీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఏపూరి రాజు

కోదాడఅర్బన్ : మహాజన సోషలిస్టు పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కుతుందని ఎంఎస్పీ కోదాడ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఏపూరి రాజు మాదిగ అన్నారు. బుధవారం ఎంఎస్పీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎంఎస్పీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకుల పేదలను కలుపుకుని గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఎంఎస్పీ జిల్లా నాయకుడు వడ్డేపల్లి కోటేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు యలమర్తి రాములు, వడ్డేపల్లి కోటేష్, నాగేశ్వరరావు, మౌలానా, సిద్దెల శ్రీను, రాజారావు, వెంకట్రావు, సూరి చిన్న వెంకట్రావు, సత్యరాజు, వెంకటి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలని వక్ఫ్ బోర్డ్ మాజీ డైరెక్టర్, ముజావర్ షేక్ సైదా కోరారు. బుధవారం ఆయన హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా వక్ఫ్ బోర్డు ఆస్తులను, పీర్ల చావడీలను రక్షించాల్సిన అధికారులు భక్షించేలా తయారయ్యారని ఆరోపించారు. ఈ విషయాలపై గతంలో సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. ఈనెల 6న మంత్రి కేటీఆర్, ఇతర మంత్రులు హుజూర్‌నగర్‌కు వస్తున్న సందర్భంగా మరోసారి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

హుజూర్‌నగర్ : మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులతో పా టు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముత్తమ్మ, సైదులు, రవి, కుమారి, లక్ష్మీకాంతం, చంద్రకళ, పద్మ, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెట్టెలు, దుప్పట్లు పంపిణీ

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన దుప్పట్లు, పెట్టెలు, ఐడీ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, జెట్పీటీసీ సభ్యురాలు బాణాల కవిత, సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, ప్రిన్సిపాల్ ధన విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.రవికృష్ణ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు దాసరి శ్రీను, అధ్యాపకుడు ఏ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీలోని రాంపురం రోడ్డుతో పాటు పలు రోడ్ల విస్తరణ పనులు చేపట్టడంతో విద్యుతీకరణలో భాగంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

పాలకవీడు : మండల కేంద్రంలో గురువారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపో అధికారులు దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు వీజేఏసీ జిల్లా కన్వీనర్ ఉపేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగులకు రాయితీపై అందజేస్తున్న ఉచిత బస్‌పాస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్, రెండు పాస్ ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సత్కారం

హుజూర్‌నగర్ : పోలీస్ ఈవెంట్స్ క్వాలిఫై అయిన వారు కష్టపడి ఉద్యోగాలు సాధించాలని హుజూర్‌నగర్ గ్రంథాలయ కమిటీ చైర్మన్ పిన్నని సంపత్ అన్నారు. దేహదారుఢ్య పరీక్షకు సిద్ధమవుతున్న సమయంలో పోలీస్ అభ్యర్థులకు అవసరమయిన ఇసుక, వాటర్ ట్యాంక్, తదితర సామగ్రిని అందించిన గ్రంథాలయ కమిటీ చైర్మన్‌ను బుధవారం సుభాష్ చంద్రబోస్ పోలీస్ ట్రైనింగ్ అకాడమీ వారు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఈవెంట్స్ ట్రైనర్ మణి మాస్టర్, అభ్యర్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : నూతనంగా ఏర్పడిన చింతలపాలెం మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు జియాలుద్దీన్ బుధవారం ఎంఈఓ సైదానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ఆది, చరణ్, సోహెల్ పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో సూదిమందు తప్పనిసరి

నడిగూడెం : చిన్నారులకు పోలియో సూది తప్పనిసరిగా వేయించాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న కోరారు. బుధవారం మండలవ్యాప్తంగా చేపట్టిన చిన్నారులకు పోలియో సూది మందు వేసే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఒకటిన్నర నెలలు, మూడున్నర నెలలు, 9 నెలలు దాటిన చిన్నారులకు విడతల వారిగా పోలియో టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శ్రీదేవి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం

నడిగూడెం : మండల పరిధిలోని చాకిరాల, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామాలలో బుధవారం బీజేపీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ కమిటీలను నియమించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, ఉపాధ్యక్షుడు ఎస్‌కె.లతీఫ్, చక్రం, ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు బండారు శోభారాణి, గాంధీ, లింగరాజు పాల్గొన్నారు.